నాడు నేడు





**నాడు మత్తడులు**
**నేడు ముళ్లకంపలు**

భూగర్భ జలాలు పెంచాలని కేసీఆర్ ప్రభుత్వం మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం సంకలమద్ది-నిజాలాపూర్ గ్రామాల శివారులో పారుతున్న పెద్దవాగుపై 2020లో రూ.5 కోట్లతో ఈ చెక్ డ్యాంను నిర్మించింది. గతేడాది పొడవునా ఈ చెక్‌డ్యాం మత్తడిపోయడంతో నిజాలాపూర్‌తో పాటు, మూసాపేట, సంకలమద్ది, మహ్మద్ హుస్సేన్‌పల్లి శివారులలో ఎక్కడ చూసినా బంగారు పంటలు పండాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దవాగులో నీటి ప్రవాహం లేక చెక్‌డ్యాం ఇలా ముళ్లకంపలతో బోసిపోయి కనిపిస్తున్నది. - ఫొటోగ్రాఫర్ మహబూబ్‌నగర్/మూసాపేట, మార్చి 5

# కరువు పడగ నీడలో..

- భోరుమంటున్న రైతన్న.. గుండె చెరువాయే
- ప్రాజెక్టుల నీళ్ల వదలక కళ తప్పిన చెరువులు
- ఆరొందల ఫీట్లకు పడిపోయిన భూగర్భ జలాలు
- నెర్రలు బారుతున్న పొలాలు.. తరుముకొస్తున్న కరువు
- అన్నదాతల కష్టం.. పశువుల మేతపాలు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జలసవ్వడులు చూసిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరువుఛాయలు కనిపిస్తున్నాయి. ప్రాజెక్టుల నీళ్లొస్తే యాసంగిలో సిరులు పండిస్తామనుకున్న రైతులకు ఇప్పుడు పెట్టుబడులు కూడా మీదపడ్డాయి. కాల్వలు, చెరువుల్లో నీళ్ల లేక.. భూగర్భ జలాలు అడుగంటిపోయి.. ఆగి ఆగి.. చుక్క చుక్క పోస్తున్న బోరుమోటరును చూసి రైతులు గుక్కపెట్టి ఏడుస్తున్నారు. కండ్లెదుట ఎండుతున్న పంటను కాపాడుకోవడానికి అడ్డగోలు బోర్లు వేసి అప్పుల ఊబిలో ఇరుక్కుపోతున్నారు. అధికారులు చివరి ఆయకట్టుకు నీళ్లిస్తామని రైతులకు హామీ ఇచ్చి ఆచరణలో విఫలమవుతున్నారు. ఈ విషయంపై ఈ విషయంపై దేవాదుల డీఈ ప్రశాంతిని వివరణ కోరగా, సరిపడా సిబ్బంది లేకపోవడంతో సమస్య వస్తుందని, చివరి గ్రామం వరకు నీరందించేలా చూస్తామని చెప్పారు. అలాగే హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని కొత్తగట్టుసింగారం నుంచి శాయంపేట వరకు ఉన్న ఎస్సారెస్పీ డీబీఎం 31 కాల్వకు నీళ్ల అందకపోవడంతో వెయ్యి ఎకరాల్లో మక్కజొన్న పంట ఎండిపోతున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- నమస్తే తెలంగాణ, న్యూస్‌నెట్‌వర్క్

- మొక్కజొన్నలో కంకి కరువు



యాసంగి నీటితో ఆరుతడి పంటల్లో భాగంగా మొక్కజొన్న పంట వేసిన ఈ రైతుది సిద్దిపేట. బోర్ల నీటితో మొక్కజొన్న పంట ఏపుగా పెరిగినా సమయానికి భూగర్భజలాలు అడుగంటడంతో తడి అందలేదు. దీంతో మొక్కజొన్న కంకి గింజలు వేయక పశువుల మేతగా మారిపోయింది.

- గంగమ్మ జాడ కోసం..





పచ్చగా ఉన్న పంటను కాపాడుకునేందుకు సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట గ్రామంలో బోర్ మెషిన్ ద్వారా మరింత లోతుకు పైపులు దించుతున్న రైతులు, పక్కన అదే గ్రామంలో కాలిపోయిన మోటార్లకు మరమ్మతులు చేస్తున్న ఓ మెకానిక్



**జీవాలకు వరిమేత..**

తుర్కపల్లి మండలం దయ్యంబండతండాకు చెందిన వాంకుతోడు హర్యా 4 ఎకరాల్లో వరి వేశాడు. భూగర్భజలాలు అడుగంటి బోర్ల ద్వారా సాగుకు నీళ్ల అందకపోవడంతో ఎండిన రెండెకరాల్లో ఇలా గొర్రెలు మేపుతున్నారు.

**ఆవుకు మేత**
**రైతుకు పస్తులు**

నల్లగొండ మండలం కేశరాజులపల్లి గ్రామంలో నీరందక ఎండిన వరిచేనులో ఆవులను మేపుతున్న రైతు



## కొత్త బోరుకు అక్షరాల లక్ష

**డ్రిల్లింగ్ చార్జి పెంచిన బోర్‌వెల్ యజమానులు**

నల్లగొండ ప్రతినిధి, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : కరువు ఛాయలతో భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు కొత్తగా బోర్లు వేస్తూ భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. అందుకోసం అక్షరాల లక్ష రూపాయలను వెచ్చించాల్సి వస్తుంది. కొత్తగా 300 అడుగుల లోతు బోరు వేసి, మోటారు బిగించి నీళ్లు పోయించాలంటే కనీసం లక్ష రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని బోర్‌వెల్స్ యజమానులు గత జనవరి నుంచి ఫీటు ధరను పది రూపాయలు పెంచారు. నల్లగొండ జిల్లాలో సగటున ప్రతి రోజు కనీసం 500 బోర్లు కొత్తగా వేస్తున్నట్లు అంచనా. ఒక్కో బోర్‌వెల్ రోజుకు సగటున 5 నుంచి 6 బోర్లు వేస్తున్నట్లు యజమానులు చెబుతున్నారు. ఎండ తీవ్రత తక్కువగా ఉంటే 8 నుంచి 10 బోర్లు కూడా వేస్తున్నారు. రైతులు చెబుతున్న దాని ప్రకారం ఒక్కో బోరు మోటారుకు కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతుంది. బోరు వేయాలంటే ఒక్కో ఫీటుకు 70 రూపాయలు చార్జి చేస్తున్నారు. ఇందులోనూ ప్రతి 100 ఫీట్లకు ఒకసారి రేట్లు పెరుగుతాయి. ఇలా ఒక రైతు 300 ఫీట్ల బోరు వేయాలంటే రూ.40 వేలు అవుతుంది. దానికి ఒక మోటారు, పైపులైను, కరెంటు వైరు కలిపి మరో 60వేల రూపాయలు అవుతుంది.

**నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం ఉన్న రేట్లు**

- 100 ఫీట్ల వరకు ఒక్కో ఫీటుకు 70 రూపాయలు
- 101 నుంచి 200 ఫీట్ల వరకు ఫీటుకు రూ.80
- 201-300 ఫీట్ల వరకు ఫీటుకు 100 రూపాయలు
- 301-400 ఫీట్ల వరకు ఫీటుకు రూ.130
- 401-500 ఫీట్ల వరకు ఫీటుకు 170 రూపాయలు
- కేసింగ్ పైపు ఫీటుకు 500 రూపాయల చార్జి. (సగటున 30 నుంచి 50ఫీట్ల వరకు వేస్తారు)
- బోర్‌వెల్ లేబర్ బత్తా, ట్రాన్స్‌పోర్టు ఖర్చు రూ.2వేలు.

**300 ఫీట్ల బోరు వేసి మోటారు బిగిస్తే అయ్యే ఖర్చు**

| | |
|---|---|
| తొలి 100 ఫీట్ల వరకు | రూ.7వేలు |
| 101-200 వరకు | రూ.8వేలు |
| 201-300 వరకు | రూ.10వేలు |
| కేసింగ్ (30 ఫీట్లు) | రూ.15వేలు |
| లేబర్ బత్తా, ట్రాన్స్‌పోర్టు | రూ.2వేలు |
| మోటార్ 7.5 హెచ్‌పీ | రూ.45వేలు |
| పైపులు, వైరు, ఎక్స్‌ట్రా | రూ.20వేలు |
| మొత్తం ఖర్చు | లక్షా 7వేలు |



## నెల రోజులు.. 600 బోర్లు

**చేర్యాల ప్రాంతంలో దుర్భిక్ష పరిస్థితులు.. 600 ఫీట్లకు పడిపోయిన భూగర్భ జలాలు**



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామంలో అడుగంటిన ఎర్రకుంట

చేర్యాల, మార్చి 5 : సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో భూగర్భ జలాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. దేవాదుల నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులు, కాల్వలు ఎండిపోతున్నాయి. బోరుబావులు వట్టిపోయి వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతుండడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. ఫిబ్రవరి మాసంలో 1.8మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఈ నాలుగు మండలాల పరిధిలో ఫిబ్రవరి మాసంలో రైతులు 600 బోర్లు తవ్వించినట్లు సమాచారం. 500 నుంచి 600 ఫీట్ల వరకు బోరు వేసినా చుక్క నీరు పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆర్థికంగా చితికి పోతున్నారు. నీళ్లు రాని రైతుల పరిస్థితి చూస్తే తమకే బాధ అనిపిస్తున్నదని బోరువెల్స్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన రాంరెడ్డి అనే రైతు సాగుచేసుకున్న 5 ఎకరాల వరి పొలంలో రెండున్నర ఎకరాలను వదిలిపెట్టుకోవడమే కాకుండా ఎండిన పొలంలో పశువులను మేపుతుండడం గమనార్హం. తలాపున తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా ఆశించిన నీటిమట్టం లేకపోవడంతో ఈ ఏడాది చెరువులు నింపే పరిస్థితులు కనిపించడం లేదు. గతేడాదితో పోలిస్తే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో పంటల సాగు సైతం తగ్గిందని వ్యవసాయశాఖ అధికారులు తెలుపుతున్నారు. రంగనాయక్‌సాగర్ నుంచి చేర్యాల, ధూళిమిట్ట మండల్లాలోని కొన్ని గ్రామాలకు కాల్వల ద్వారా గోదావరి జలాలు వస్తుండగా చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల్లోని కాల్వల్లో నీరు లేక వెలవెలబోతున్నాయి.



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో నీళ్ల పడని బోరు

### ప్రాణం తరుక్కుపోతాంది



పదేండ్లుగా యాసంగికి నీటి ఇబ్బంది ఎప్పుడూ రాలే. రెండు పంటలు మంచిగ పండించేటోళ్లం. ప్రతి ఏడాది మాదిరిగానే ఏటిలో నీరుంటాయనుకుంటే ఈ ఏడాది నిరాశ మిగిలింది. పాకాల ఏటిలో చుక్క నీరు లేక రాళ్లురప్పలు తేలినయ్. వేల రూపాయల పెట్టుబడి పెట్టి వరి సాగు చేసి నెలకు పైగా కాపాడుకుంటూ వచ్చాం. కానీ నీరు లేక కండ్ల ముందు ఎండిపోతుంటే ప్రాణం తరుక్కుపోతంది.

- బొడా కిషన్, జగ్గుతండా

### ఈ ఏడాది పంట పోయినట్టే



పాకాల ఏటిలో నీటిని నమ్ముకొని ఆయకట్టు రైతులం యా సంగి సాగు చేస్తాం. ఈ ఏడాది నీటి ఎద్దడి ఉంటుందని భావించి నీటి అవసరం తక్కువగా ఉండే మినుప పంట వేశా. ఆరు ఎకరాలకు సుమారు లక్ష వరకు పెట్టుబడి అయింది. వేసవి తాపం పెరగటంతో ఏటిలో నీరు పూర్తిగా అడుగంటింది. మినుప పంటకు నీరు సరిపోక ఎండిపోతాంది. నీటి సమస్య కారణంగా ఈ ఏడాది పంట నష్టపోయినట్టే.

- ముత్తినేని భాస్కరావు, బయ్యారం



### ప్రాజెక్టు నీళ్లు రాకనే..

నాకు ఎకరం 22 గంటలు ఉంది. రూ.2.50 లక్షలతో 520 ఫీట్ల లోతు బోరు వేయించిన. కాళేశ్వరం నీళ్లొచ్చినపుడు బోరు మస్తు పోసింది. దాంతో మరో ఎకరం కౌలుకు తీసుకున్నా. ఇప్పుడు ప్రాజెక్టు నీళ్ల రాక భూ గర్భ జలాలు అడుగంటుపోయినయ్. నాకున్న ఎకరం 20 గుంటలతో పాటు కౌలుకు తీసుకున్న పొలం ఎండిపోతున్నది. కాంగ్రెస్ సర్కారు చెరువులు, కుంటలను నింపి ఆదుకోవాలి.

- సుంకరి మోహన్, రైతు, గుమ్లాపూర్, చొప్పదండి మండలం, కరీంనగర్ జిల్లా

### పదేండ్లలో పంటలు ఎండలేదు



తండాలో నాకు రెండెకరాలున్నది. రెండు బోర్లు వేశాను. వాటి ఆధారంగా వరి పంట సాగు చేశాను. ఇప్పుడు పంట పొట్ట దశకు వచ్చింది. 15 రోజులుగా బోర్లు రోజురోజుకూ తగ్గుతున్నాయి. ఇప్పటికే ఒక ఎకరం పొలం ఎండిపోయింది. పదేండ్లుగా ఎప్పుడూ ఇలా జరుగలేదు.

- వాంకుడోతు మారోణి, దయ్యంబండతండా, తుర్కపల్లి మండలం




నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## ఎకరాకు 300 వసూలు

**నీటి పారుదల శాఖ అధికారిపై రైతుల ఆరోపణ**
**20 రోజులుగా నీరివ్వడం లేదని ఆందోళన**
**నిర్మల్-మంచిర్యాల రహదారిపై రెండు గంటలు ధర్నా**

కడెం, మార్చి 5 : సదర్మాట్ చివరి ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వాలని రైతులు మంగళవారం నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారిపై రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఇరువైపులా అర కిలోమీటరు మేర వాహనాలు నిలువడంతో కడెం ఎస్ఐ రాజు ఘటనాస్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు రావాలని, నీళ్లు వదులుతామని హామీ ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని కొత్త మద్దిపడగ, పాత మద్దిపడగ, లక్ష్మీసాగర్, పెద్దూర్ గ్రామాలకు చెందిన రైతులు పట్టు పట్టారు. తహసీల్దార్ సుజాతారెడ్డి వచ్చి చివరి ఆయకట్టు వరకు నీటిని అందిస్తామని హామీ ఇచ్చినా ఆందోళన విరమించలేదు. తహసీల్దార్ సమాచారంతో నీటి పారుదల శాఖ ఈఈ విఠల్, ఏఈ రవికుమార్‌లు ఘటనా స్థలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏఈ రవికుమార్‌ను సస్పెండ్ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇతర గ్రామాల రైతుల వద్ద ఎకరాకు రూ. 300 చొప్పున వసూలు చేసి నీటిని మళ్లిస్తున్నారని, 20 రోజులుగా తమ పంటలు ఎండుతున్నా నీరివ్వడం లేదని మండిపడ్డారు. చివరికి ఈఈ విఠల్ ఆయకట్టు చివరి వరకు ప్రతి ఎకరాకు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.